సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



అట్టహాసంగా హాకీ పోటీలు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు నక్కపల్లిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. 600 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. IIలో



విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాఖ: విశాలాంధ్ర బుక్ హౌస్ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.



రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

విశాఖ: ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

న్యూస్‌రీల్

యథావిధిగా మధ్యాహ్న భోజనం



చిన్నారులకు అందించిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో పద్మావతి

అనకాపల్లి టౌన్: పట్టణం, మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బందితో చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో గురువారం యథావిధిగా కేంద్రాలు తెరచుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మల్లవీధి, గాంధీబొమ్మ, లోకావారివీధి, తాకాశివీధి, రామాలయంవీధి, పిసినికాడ, బీఆర్టీ కాలనీ, రేబాక అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి, ఆయా కేంద్రాల చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించినట్లు చెప్పారు. సూపర్‌వైజర్లు లక్ష్మి, సౌజన్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ రేపు

- హాజరుకానున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి, వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు

సాక్షి, అనకాపల్లి: దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జె.వి.బి.జగదీష్ గురువారం తెలిపారు. ఈ నెల 16న స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత(దివ్యాంగన్) మంత్రి ఎ.నారాయణస్వామి, అతిథులుగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రభుత్వంచే గుర్తించబడిన ఆలిమ్ అండ్ కో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం(హైదరాబాద్) వారిచే సహాయ ఉపకరణాల పంపిణీ జరగనుందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు పొందిన వారితో పాటు విభిన్న ప్రతిభావంతులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఈ ఉపకరణాలు అందిస్తామన్నారు.

తండ్రి రుణం తీర్చుకుంది..



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నవ్య

కశింకోట: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది. కశింకోటలోని గవరపేటలో ఈ ఘటన జరిగింది. భూముల కొనుగోలు, అమ్మకాల్లో మధ్యవర్తిత్వంతో జీవనం సాగిస్తున్న వేగి వెంకటరావు (60) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కుమారులు లేరు. నవ్య, మంజు అనే ఇద్దరు కుమార్తెలు, భార్య సత్యవతి ఉన్నారు. పెద్ద కుమార్తె నవ్య తండ్రికి స్థానిక సాధుమఠం శ్మశాన వాటికలో తలకొరివి పెట్టి అంతిమ సంస్కారం జరిపింది. కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి తండ్రికి అంతిమ వీడ్కోలు పలికింది.

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించాలి

- ఆర్‌ఐవో సత్యనారాయణ



మాట్లాడుతున్న ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య : ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించాలని ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లతో గురువారం విశాఖలోని ఏవీఎన్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ సబ్జెక్టులను షెడ్యూల్ మేరకు బోధించటంతో పాటు, సైన్సు విద్యార్థులకు తప్పనిసరిగా ప్రాక్టికల్స్ నిర్వహించాలన్నారు. ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహించని కాలేజీలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

జోరుగా పంట నష్టం నమోదు

- రెండు రోజులుగా రంగంలోకి దిగిన గ్రామ, మండలస్థాయి బృందాలు
- 18లోగా క్షేత్రస్థాయి పంట నష్టం నమోదు ప్రక్రియ పూర్తికి చర్యలు
- ఆర్బీకేల్లో పంటనష్టం జాబితాలపై రైతుల సమక్షంలో పంచనామా
- 22న తుది జాబితా సిద్ధం చేసేందుకు అధికారుల కసరత్తు



చాకిపల్లి ప్రాంతంలో నీటమునిగి కుళ్లిపోయిన వరి పంట



అంకుపాలెంలో పంటనష్టం నమోదు చేస్తున్న గ్రామ స్థాయి కమిటీ

చోడవరం: జిల్లాలో తుపాను పంట నష్టం గుర్తించేందుకు వ్యవసాయ బృందాలు రంగంలోకి దిగాయి. రెండ్రోజుల నుంచి క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ బృందాలు నిమగ్నమయ్యాయి. పంట చేతికొచ్చే సమయంలో తుపాను వర్షాలు భారీగా కురవడంతో వరాహ, శారద, పెద్దేరు నదీ పరివాహక ప్రాంతాలతోపాటు ఆవ చెరువులు ఉన్న ఆయకట్టు భూముల్లో వరి పంట చాలా మేర నీట మునిగింది. ప్రధానంగా కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, యలమంచిలి, కశింకోట, మునగపాక, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, నర్సీపట్నం, రోలుగుంట మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, అనకాపల్లి మండలాల్లో ఎక్కువ శాతం వరి పంట నష్టం జరిగినట్టు తుపాను సమయంలో అధికారులు గుర్తించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 34 వేల ఎకరాల్లో వరి పంట, 44 ఎకరాల్లో చెరకు పంట, మరో 3 ఎకరాల్లో పొగాకు, అపరాల పంటలపై తుపాను ప్రభావం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత నదుల్లో నీరు దిగువ సముద్రంలోకి వెళ్లిపోవడం, పొలాల్లో నీరు తగ్గడంతో రైతులు చాలా మేర పంటను నిలబెట్టుకొని వెంటనే కోతలు కోసి కుప్పలు పెట్టారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో పంటనష్టం నమోదు జరుగుతుండటంతో ఈ రైతులకే నష్టపరిహారం అందుతుంది. ప్రభుత్వం కూడా తక్షణ కర్తవ్యంగా పంట నష్టం గుర్తించేందుకు ఈనెల 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై గ్రామస్థాయి (ఆర్బీకే పరిధి), మండల స్థాయిలో అధికారులను బృందాలుగా నియమించింది. ఈ బృందాల్లో స్థానిక వ్యవసాయాధికారి, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీని గ్రామస్థాయి కమిటీల్లో నియమించారు. మండలస్థాయిలో మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎంపీడీవోలను కమిటీల్లో వేశారు. ఈ 12వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో పంట నష్టం గుర్తించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన, నమోదుకు ఈ బృందాలు రంగంలోకి దిగాయి. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చెప్పడంతో ఆ దిశగా రైతులకు న్యాయం చేసే విధంగా పంట నష్టం నమోదు ప్రక్రియ జరుగుతోంది.

నష్టపోయిన ప్రతి రైతుకు వర్తించేలా చర్యలు



జిల్లా అంతటా ఒకేసారి తుపాను పంట నష్టం నమోదు చేపట్టాం. పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు నష్టపరిహారం వర్తించేలా చర్యలు చేపట్టాం. ఈనెల 18వ తేదీలోగా క్షేత్ర స్థాయి పంట నష్టం నమోదు అనంతరం నమోదైన రైతుల జాబితాను గ్రామస్థాయిలో ఆర్బీకేల్లో వేలాడదీస్తాం. గ్రామస్తుల సమక్షంలో పంచనామా అనంతరం ఈనెల 22వ తేదీన తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతాం. ఎస్డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం వరికి హెక్టారుకు రూ.17 వేల నష్టపరిహారం వస్తుంది.

– బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

పంట నష్టం నమోదులో నిబంధనలు

ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం 33 శాతానికి పైబడి పొలంలో పంట నష్టపోతే నమోదు చేస్తారు. పొలంలో కోత కోయకుండా ఉన్న పంట నీట మునిగి నేలపడిపోయి కుళ్లిపోతే రికార్డు చేస్తారు. కోసేసిన పంట పొలంలోనే ఉండిపోయి గింజ రాలిపోయి మొలక వస్తే నష్టంగా నమోదు చేస్తారు. 5 ఎకరాల పల్లం భూమి ఉన్న రైతులకు పంట నష్టం వర్తించదు కనుక వారిని నమోదు చేయరు. ప్రధానంగా పంట నష్టం నమోదుకు ఈ క్రాప్ ఐడీ నెంబరు నమోదు చేయాల్సి ఉన్నందున ఈ క్రాప్, ఈకేవైసీ చేసిన రైతు భూముల్లో పంట నష్టం మాత్రమే నమోదు చేయడం జరుగుతుంది. అయితే జిల్లాలో 99 శాతం ఈ క్రాప్, ఈకేవైసీలు గతంలోనే నమోదై ఉండటం వల్ల నష్టపోయిన రైతులందరి పంట నమోదయ్యే అవకాశం ఉంది.

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

గోపాలపట్నం (విశాఖ): శ్రీకాకుళం జిల్లా పర్యటన నిమిత్తం గురువారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన ఆయన 9.13 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీఎంతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని విశాఖ వచ్చారు. ఇక్కడి నుంచి 9.27 గంటలకు సీఎం జగన్ హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరారు. ఆయన వెంట మంత్రులు బూడి ముత్యాలనాయుడు, విడదల రజని ఉన్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 5.13 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడ నుంచి 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.

విద్యుత్ పొదుపు చేస్తే ఉత్పత్తి చేసినట్లే..

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్, డైరెక్టర్లు రమేష్ ప్రసాద్, చంద్రం, సూర్యప్రతాప్

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే.. రెండు యూనిట్లను ఉత్పత్తి చేసిన వారమవుతామన్నారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని విద్యుత్ పొదుపునకు సంబంధించిన బ్యానర్లు, కరపత్రాలు, వాల్ పోస్టర్లను సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపును తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో ఈ నెల 20 వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు, కళా ప్రదర్శనలు, పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సర్కిల్ ఎస్ఈలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు.

ఉత్తరాంధ్రను ఎందుకు విస్మరించారో చెప్పాలి

- అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబు, లోకేష్
- ఎమ్మెల్యే బాబూరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు, బొడ్డేడ ప్రసాద్, సూర్యనారాయణరాజు

ఎస్.రాయవరం: పచ్చి అబద్ధాలాడుతూ ప్రజలను ఏమార్చే విధంగా నారా లోకేష్ యువగళం పాదయాత్ర సాగుతోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు విమర్శించారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు 14 ఏళ్లు అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలకు ఏ చేశారో, ఎందుకు చేయలేకపోయారో ప్రజలకు వివరించాలన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తూ మత్స్యకారులకు స్వర్గం చూపిస్తానని లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబునాయుడు బీసీలను పూర్తిగా పక్కన పెట్టారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ఉత్తరాంధ్ర ద్రోహి అని, విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటిస్తే వ్యతిరేకమా, సానుకూలమా చెప్పాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్రను అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే తెలుగు తమ్ముళ్లు అడ్డుపడుతున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు చిక్కాల రామారావు, నక్కపల్లి, కోటవురట్ల మండలాల పార్టీ అధ్యక్షులు శీరం నరసింహామూర్తి, కుమార్‌రాజా, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, అల్లాడ నాగరాజు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మాతా గురునాథ్‌రావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల నూతన వ్యవసాయ కమిటీ నియామకం

- చైర్మన్‌గా సేనాపతి కొండలరావు, వైస్ చైర్మన్‌గా శ్రీనాథ్ శ్రీనివాసరావు

IIలో

21న టిడ్కో గృహ ప్రవేశాలు

- నెరవేరనున్న పేదోడి సొంతింటి కల
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: పేదోడి సొంతింటి కల నిజం కాబోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడ్కో గృహప్రవేశాలకు సమయం ఆసన్నమైందని, నియోజకవర్గంలో 2,744 గృహాల నిర్మాణం పూర్తయిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం మెగా లేఅవుట్‌లో నిర్మించిన టిడ్కో గృహాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలను నాణ్యతతోపాటు అందంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఇక్కడ నివసించేవారికి అవసరమైన రహదారితో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. కాలనీలో వీధి దీపాలు, మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. మూడు విభాగాల్లో ఇళ్లు నిర్మించామని, 300 చ.అ. విస్తీర్ణం కలిగిన 2,296 గృహాలను లబ్ధిదారులకు ఈ నెల 21న అందించనున్నట్లు వెల్లడించారు. ఒక్కో గృహ నిర్మాణానికి రూ.6 లక్షల 55 వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తోందన్నారు. 365 చ.అ. విస్తీర్ణం గల 96 గృహాలకు ఒక్కోదానికి రూ.7.50 లక్షలు ఖర్చుచేసినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.25 వేలు లబ్ధిదారుల వాటా కాగా రూ.3.15 లక్షలు లబ్ధిదారులు రుణంగా పేర్కొన్నారు. మిగిలినది ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తోందన్నారు. 430 చ.అ.విస్తీర్ణంగల 352 గృహాల్లో ఒక్కో గృహానికి రూ.8.50 లక్షలు ఖర్చు చేశామన్నారు. లబ్ధిదారుడి వాటా రూ.50 వేలు, రూ.3.65 లక్షలు రుణంగా చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వ సబ్సిడీగా పేర్కొన్నారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, గృహప్రవేశాలు చేయిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పేదోడి సొంతింటి కల సాకారమవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సిరులతల్లీ.. ప్రణామం

- వైభవంగా మార్గశిర మాసం మొదటి గురువారం పూజలు
- కనకమహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- అర్ధరాత్రి తొలి దర్శనంతో పులకించిన భక్త జనం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు



అమ్మవారికి కలువలతో పూజలు



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

డాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణాలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం, విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి, పసుపు పూశారు. అనంతరం అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి, బుధవారం అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వెండి కవచాలు తొడిగారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి తొలి దర్శనం చేసుకుని భక్త జనం పులకించిపోయింది. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

ఉచిత బస్సు సర్వీసులు

భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి రెండు ఉచిత బస్సు సర్వీసులు నడిపినట్టు ఆలయ ఈవో తెలిపారు.

దర్శన క్యూలైన్లు ఇలా..

టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనం, రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500 మార్గశిర విశిష్ట దర్శనం కల్పించారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం కార్యాలయం ఎదురుగా దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఘోషాస్పత్రి వద్ద అగ్నిమాపక యంత్రం, రీడింగ్ రూమ్ వద్ద మొబైల్ టాయిలెట్‌ను అందుబాటులో ఉంచారు. అమ్మవారి ఆలయం సమీపంలో పోలీస్ అవుట్ పోస్టుతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు.

3 వేల మందికి అన్నదానం

టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, పర్యవేక్షక ఇంజినీరు మహేంద్రనాథ్

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ప్రజలందరూ ఇంధన పొదుపుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు సందర్భంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనకాపల్లి రింగురోడ్డు వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్, గ్లీజర్, ఏసీ వాడకంలో ఇంధన పరిరక్షణ చిట్కాలను అందరూ తప్పక పాటించాలన్నారు. పరిశ్రమలతోపాటు అధిక జనాభా వల్ల దేశంలో విద్యుత్ వాడకం పెరుగుతూ వస్తుందన్నారు. మనం విద్యుత్‌ను ఆదా చేసి భావితరాల వారికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. అంతకుముందు అందరితో ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఈపీడీసీఎల్ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు ఎల్. మహేంద్రనాథ్ మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్, గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 16వ తేదీన జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 17న విద్యుత్ పొదుపు ఆవశ్యకత నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులతో ఇంజినీరింగ్ కళాశాలల్లో వర్క్ షాప్, 18న కార్యాలయాల్లో అవగాహన, 19న గ్రామాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ఇంధన పొదుపుపై ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. 20న విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. డీఈఈలు కె.రాజశేఖర్, ఎస్.రామకృష్ణ, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

- గెడ్డలో పడి విద్యార్థి మృతి ఘటనపై చర్యలు
- విచారణ నిర్వహించిన ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

డుంబ్రిగుడ: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ రామును గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశాల మేరకు గురువారం సస్పెండ్ చేసినట్టు ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి సంతోష్ గెడ్డలో దిగి మృతి చెందడం తెలిసిందే. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్టుగా ఆయన పేర్కొన్నారు. విద్యార్థి మృతి ఘటనపై గురువారం ఆయన ఆశ్రమ పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు



హాకీ పోటీలు ప్రారంభిస్తున్న కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ



హోరాహోరీగా జరుగుతున్న హాకీ పోటీలు

- నక్కపల్లిలో ఉత్సాహంగా ప్రారంభం
- 600 మంది క్రీడాకారుల హాజరు

నక్కపల్లి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నక్కపల్లిలో అండర్ -19 విభాగంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. బాలురకు హాకీ క్రీడా మైదానంలోను, బాలికలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోను పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బోదిగల్లం రోడ్డులోని హెటిరో హాకీ క్రీడా ప్రాంగణంలో ముందుగా జాతీయ జెండాను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వీసం రామకృష్ణ ఆవిష్కరించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రాధాన్యమిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలను ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభిస్తుందన్నారు. నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు కృషితో నక్కపల్లికి దేశవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. గత నెలలో ఇక్కడ అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. మళ్లీ ఇక్కడే పోటీలు జరగడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నారన్నారు.

ఉద్యోగాలతోపాటు, స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు పొందడం అభినందనీయమన్నారు. ఇక్కడ క్రీడాకారుల ప్రతిభను దృష్టిలో ఉంచుకుని హెటిరో యాజమాన్యం పంచాయతీ వారి సహకారంతో సువిశాలమైన క్రీడా ప్రాంగణం సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, సర్పంచ్ నేతల జయరత్నకుమారి, ఎంపీటీసీ గొర్ల దుర్గాగోవిందు, ఇంటర్ బోర్డు అధికారి బీ సుజాత, హాకీ టోర్నమెంట్ పరిశీలకుడు సుధీర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషశైలజ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంబాబు, బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు, వార్డు సభ్యుడు కే నానాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా తొలి రోజు పోటీలు

తొలి రోజు పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో విజయనగరం – ప్రకాశం జిల్లా జట్లు తలపడ్డాయి. ప్రకాశం జట్టు విజయం సాధించింది. పశ్చిమ గోదావరిపై చిత్తూరు, శ్రీకాకుళంపై అనంతపురం జట్లు విజయం సాధించాయి. కర్నూలు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య, తూర్పుగోదావరి – గుంటూరు మధ్య పోటీలు 2–2తో డ్రాగా ముగిశాయి. అనంతపురం – విశాఖపట్నం మ్యాచ్ 1–1తో డ్రాగా ముగిసింది. బాలికల విభాగంలో అనంతపురంపై చిత్తూరు విజయం సాధించింది.

సీఎం జన్మదినాన మెగా రక్తదాన శిబిరం

- విజయవంతం చేయాలన్న నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నర్సీపట్నం నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని 2011 నుంచి రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి, మొదటగా తానే రక్తదానం చేస్తున్నానన్నారు. ఈ నెల 30న నర్సీపట్నంలో సామాజిక సాధికార బస్సు యాత్ర ఉంటుందన్నారు. దీనికి నాలుగు మండలాల నుంచి 40 వేల మంది జనాన్ని సమీకరించాలని పార్టీ నాయకులకు సూచించారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకుడు బి.కాశీ విశ్వనాథంతో కలిసి రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, సాగిన లక్ష్మణ్‌మూర్తి, రుత్తల సత్యనారాయణ, మణికుమారి, జెడ్పీటీసీలు సుర్ల గిరిబాబు, అప్పలనర్స, చింతకాయల వరుణ్, పార్టీ మండలాధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల నూతన వ్యవసాయ కమిటీ నియామకం

- గౌరవ అధ్యక్షుడిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- చైర్మన్‌గా సేనాపతి కొండలరావు, వైస్ చైర్మన్‌గా శ్రీనాథ్ శ్రీనివాసరావు



నూతన అధ్యక్షుడు సేనాపతి కొండలరావు

సాక్షి, అనకాపల్లి: మాడుగులలో నూతన వ్యవసాయ కమిటీని గురువారం నియమించారు. నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీని కొత్తగా ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి 20 మంది సభ్యులతో కూడిన నూతన పాలక వర్గాన్ని ఏడాది కాల పరిమితితో నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, చైర్మన్‌గా సేనాపతి కొండలరావు, వైఎస్ చైర్మన్‌గా శ్రీనాథ్ శ్రీనివాసరావులతో పాటు మరో 17 మంది సభ్యులను ప్రకటించారు. కమిటీ ఏర్పాటు ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, అమ్మకం మరింత సులభతరం అవుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం చొరవతో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పడి, తమకు ఎంతో మేలు జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

కమిటీ సభ్యులు వీరే..

వ్యవసాయ కమిటీ సభ్యులుగా భీశెట్టి జగ్గారావు, పరవాడ నాయుడు, దొండా నాగమణి, కొల్లి కృష్ణవేణి, రాజి నాగ వెంకట సుబ్బలక్ష్మి, సయ్యపురెడ్డి నారాయణరావు, శీరా సన్నెమ్మ, నందారపు అప్పల సత్యనారాయణ, బుడతల అప్పయ్యమ్మ, వెచ్చలపు మానిక వెంకట క్రాంతి కుమారి, దొమ్మంగి సన్యాసమ్మ, నూతిగట్టు నాగ శంకర్, బసవ రామ పరమేశ్వరరావులను నియమించారు.

పోలీసు మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ మురళీకృష్ణ



వెంకటేష్‌కు చెక్కునందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: పోలీసు శాఖలో పని చేసి మృతి చెందిన వారి కుటుంబాలు ధైర్యంగా జీవించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీసు మృతుల కుటుంబాలకు రూ.50 వేల చెక్కు అందజేశారు. చోడవరం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి.భీమావెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందగా, అతని కుమారుడు వెంకటేష్‌కు ఫ్లాట్‌ఫండ్ కింద రూ.25 వేలు, నక్కపల్లి పీఎస్ మహిళా కానిస్టేబుల్ డి.దుర్గాభవాని మృతితో ఆమె తల్లి చందక రాధికకు రూ.25 వేల చొప్పున అందజేశారు. ఇరువురి కుటుంబ సభ్యులకు శాఖాపరంగా సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, ఏవో బి.శారద, జూనియర్ అసిస్టెంట్ వరలక్ష్మి పాల్గొన్నారు.

'నాక్' బృందం చోడవరం డిగ్రీ కళాశాల సందర్శన



ప్రయోగశాలను పరిశీలిస్తున్న నాక్ బృందం

చోడవరం రూరల్: నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (నాక్) బృందం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించింది. రెండు రోజుల పాటు ఇక్కడ విద్యా ప్రమాణాలను, మౌలిక సదుపాయాలను, అధ్యాపక సిబ్బందిని, తదితర అంశాల వారీగా పరిశీలించింది. నాక్ కోర్ టీం చైర్మన్, మాజీ వైస్ చాన్సలర్ ముజాహిల్ కిద్వాయ్, మెంబర్ కోఆర్డినేటర్ పంచాంగదాస్, సభ్యురాలు దీపాన్విత చక్రవర్తిల బృందం కళాశాలకు నాక్ అక్రిడిటేషన్ కల్పించేందుకు గల అవకాశాలను శాఖల వారీ పరిశీలించింది. విద్యార్థులను, పూర్వ విద్యార్థులను కలసి పలు వివరాలు సేకరించింది. పూర్వపు ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు ఈ మేరకు గతంలో చేసిన సూచనల ప్రకారం ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది నాక్ బృందానికి కళాశాల గురించి వివరాలను అందజేశారు. ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నాక్ బృందం తిలకించింది. నాక్ బృందం సంతృప్తి చెంది నాక్ అక్రిడిటేషన్‌కు అనుమతిస్తే 41 ఏళ్ల క్రితం స్థాపించబడిన కళాశాలకు మరింత వన్నె తెస్తుందని చెప్పవచ్చు.

చీడికాడలో ధాన్యం కొనుగోలు ప్రారంభం



చీడికాడలో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మకాలు సాగించాలని ఎంపీపీ కురచా జయమ్మ కోరారు. గురువారం చీడికాడ, దిబ్బపాలెం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో కృష్ణవేణి మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2,183, గ్రేడ్ -ఏ రకం రూ.2,203గా ధర నిర్ణయించామన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మకాలు సాగించిన రైతులకు 21 రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ఈ–క్రాపులో నమోదు చేసుకున్న రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు పాల్గొన్నారు.

సహేతుక డేటాను సమర్పించే బాధ్యత ఎంఈవోలదే



మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ



హాజరైన ఎంఈవోలు, హెచ్ఎంలు, ఇతర సిబ్బంది

- శిక్షణ కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ

కశింకోట: శత శాతం యుడిస్‌ప్లస్ సహేతుక డేటాను సమర్పించే బాధ్యత ఎంఈవోలదేనని డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ అన్నారు. కశింకోట డీపీఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నోడల్ ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని రకాల యాజమాన్య పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు, బోధనా సిబ్బంది వివరాలు, మౌలిక వసతులు, వివిధ రకాలుగా పొందుతున్న నిధులు, బోధనా సిబ్బంది శిక్షణ కార్యక్రమాల వివరాలను ఆన్‌లైన్‌లో డేటా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను మండలాల్లోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, కళాశాల ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం యుడిస్‌ప్లస్ డేటా తప్పులు లేని సమాచారాన్ని హెచ్ఎంలతో నింపించాలన్నారు. వారు డేటాను పూర్తి స్థాయిలో సమర్పించిన తర్వాత మండల స్థాయి బృందం క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ నేపథ్యంలో డేటా సహేతుకమైనదేనని నిర్ధారించిన తర్వాత సంతకాలు చేసి ధ్రువీకరించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లా ఉప విద్యా శాఖ అధికారి అప్పారావు ప్రారంభించిన శిబిరంలో జిల్లా సహాయక గణాంక అధికారి సత్యప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్కీమ్స్) ఆడారి రవిబాబు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ఆర్.వి అప్పారావు, ఎంఈవో కె. చిట్టిబాబు, మూర్తి పాల్గొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ జిల్లా స్థాయి ఎంపికలు నేడు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్లు సంబంధిత జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంటు వనం సన్యాసిరావు గురువారం తెలిపారు. ఇక్కడ అండర్–11, 14, 17 బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్‌కు సంబంధించి వివిధ కేటగిరీల్లో మధ్యాహ్నం మూడు గంటలకు ఈ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 8317643885, 9573342621 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



ఘటనాస్థలిలో ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

అనకాపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో అక్కిరెడ్డి శ్రీను(31)అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు కథనం మేరకు వివరాలు. మండలంలో గొలగాం పంచాయతీ, కొత్తతలారివానిపాలెం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి శ్రీను ట్రాకర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీను గృహానికి కావాల్సిన ఇటుకల నిమిత్తం కొండుపాలెం వెళ్తుండగా అనకాపల్లి – సబ్బవరం సర్వీస్ రోడ్డులో మండలంలో కోడూరు జాతీయ రహదారి బ్రిడి మలుపులో ట్రాక్టర్‌ను టిప్పర్‌లారీ ఢీకొనడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి భార్య అక్కిరెడ్డి వెంకట సౌమ్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతునికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. భార్య సౌమ్యశ్రీ ఆరునెలల గర్భిణి.

17న మిస్టర్ ఆంధ్రా రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

తుమ్మపాల: గవరపాలెంలోని వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో ఈ నెల 17న మిస్టర్ ఆంధ్రా–2023 రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్, మెన్‌ఫిజిక్ పోటీలు జరగనున్నట్లు పట్టణ బాడీ బిల్డర్స్, ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కృష్ణాజీ, ఎస్.బాబి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జిల్లా ఏర్పాటైన తర్వాత పట్టణంలో మొదటిసారిగా నిర్వహించే ఈ పోటీల్లో మిస్టర్ ఏషియా (మాల్దీవ్), మిస్టర్ వరల్డ్ (థాయిలాండ్), మిస్టర్ ఇండియా (పంజాబ్), ఎన్.ఎం.నాయుడు (ఇండియన్ ఆర్మీ) పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథులుగా దైట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ఒలింపియన్ ఎం.మాణిక్యాలు, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ హాజరవుతారన్నారు.

సందట్లో సడేమియా



లైనుకొత్తూరు వద్ద యువగళం యాత్రలో నడుస్తున్న నారా లోకేష్



యలమంచిలిలో ఓ వైపు లోకేష్ పాదయాత్ర, మరోవైపు మద్యం కొనుగోలు చేస్తున్న కార్యకర్త

- 'యువగళం'లో పర్సులు, ఫోన్ల చోరీ

యలమంచిలి (అనకాపల్లి రూరల్): సందట్లో సడేమియా అన్న చందంగా నారా లోకేష్ యువగళం పాదయాత్రలో జేబుదొంగలు తమ చేతివాటం చూపారు. పులపర్తికి చెందిన కన్నం వెంకటేశ్వరరావు పర్సును కాజేశారు. అందులో రూ.4,800తో పాటు ఏటీఎం, క్రెడిట్ కార్డులు పోయాయి. ఏటికొప్పాకకు చెందిన టీడీపీ సీనియర్ నేతవి, రూ.25 వేలు, పులపర్తికి చెందిన స్కూల్ కమిటీ చైర్మన్ బెజవాడ వీర్రాజువి రూ.14,250 చోరీ చేశారు. ఇలా క్షణాల్లో పలువురి జేబులు ఖాళీ కావడంతో అయోమయానికి గురయ్యారు. నామవరం వద్ద కొందరు జేబులను ఖాళీ చేయడానికి ప్రయత్నించిన వారిని పట్టుకోగా, పచ్చ పార్టీకి చెందిన వారే కావడంతో పోలీసులకు అప్పగిస్తే పార్టీ పరువు బజారున పడుతుందని మిన్నకుండిపోవడాన్ని ఆ పార్టీ నేతలే తప్పుపడుతున్నారు.

యలమంచిలిలో కనిపించని స్పందన

లోకేశ్ పాదయాత్రకు జన సమీకరణ టీడీపీ శ్రేణులకు కష్టతరంగా మారింది. చివరికి గత్యంతరం లేక బేరమాడుకుని ఆటోల ద్వారా పాదయాత్రకు తీసుకొచ్చారు. పసుపురంగు టీ–షర్ట్ వేసుకుని జెండా పట్టుకున్న వారికి రూ.500 చొప్పున ఇచ్చారు. ఇదే అవకాశంగా చేసుకున్న చాలా మంది డబ్బులు తీసుకుని నాలుగడుగులు నడిచిన తర్వాత ఎక్కడ మందు దుకాణం ఉంటే అక్కడే ఆగిపోయి మద్యం సేవించడం కనిపించింది.

కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



దుకాణాల ముందు పందిళ్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రావికమతం: ఎట్టకేలకు కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం– భీమునిపట్నం రహదారిలో 15 ఏళ్ల క్రితమే 70 అడుగుల మేర రోడ్డు విస్తరించారు. ఆ సమయంలో కొత్తకోటలో విస్తరణకు ఆటంకాలు ఏర్పడటంతో వదిలేశారు. దాంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట మండలం వెలంకాయపాలెం వరకు రోడ్డు విస్తరణకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.104 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఆర్నెల్లుగా జాప్యమవుతున్న ఈ పనులు ప్రారంభం కావడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా 30 అడుగుల చొప్పున గతంలో ఇచ్చిన మార్కింగ్ మేరకు పంచాయతీ పాలకవర్గం, పోలీసుల పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు.

విజృంభిస్తున్న చలి గాలులు

- వణుకుతున్న గిరి గ్రామాలు




పాడేరులో చలిమంటలను కాగుతున్న ప్రజలు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి.కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.పొగమంచు కురుస్తుండడంతో పాటు సాయంత్రం నుంచే చలితీవ్రత నెలకొంటోంది.రాత్రి సమయంలో చలి వణికిస్తుండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. గురువారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 12డిగ్రీలు, అరకులోయలో 12.9డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు తెలిపారు.


ఐటీడీఏ కాలనీలో కలప డిపో ఏర్పాటు

కొయ్యూరు: విశాఖ జిల్లాగా ఉన్నంత వరకు ఇక్కడ పట్టుబడిన కలపను గొలుగొండ కలప డిపోకు తరలించేవారు. అల్లూరి జిల్లాగా మారిన తరువాత రేంజ్ కూడా పెదవలసగా మారింది. దీంతో మొదట్లో కలపను 70కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లికి తరలించేందుకు ఇబ్బంది పడేవారు. సమస్యను అధిగమించేందుకు పీవో అభిషేక్ కొయ్యూరు మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో డిపో ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు.

టీడీపీలో నాయకులే కరువయ్యారా?



టీడీపీ ఫ్లెక్సీలో అప్పలకృష్ణ (సర్కిల్ చేసిన వ్యక్తి)



టీడీపీ నేతల తీరును ఖండిస్తున్న అప్పలకృష్ణ, సచివాలయ కన్వీనర్ అప్పారావు

- టీడీపీ ఫ్లెక్సీలో వైఎస్సార్‌సీపీ నేత అప్పలకృష్ణ ఫొటో
- ఖండించిన అధికార పార్టీ నాయకుడు

రాంబిల్లి: టీడీపీ నాయకుడు లోకేష్ పాదయాత్ర సందర్భంగా రాంబిల్లి మండలం వెంకటాపురంలో టీడీపీ ఫ్లెక్సీలో ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరా అప్పలకృష్ణ ఫొటో వేయడం వివాదస్పదంగా మారింది. లోకేష్ పాదయాత్ర గురువారం రాత్రి రాంబిల్లి మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా వెంకటాపురంలో అక్కడి టీడీపీ నాయకులు అప్పలకృష్ణ ఫొటోను ఫేస్‌బుక్ నుంచి డౌన్‌లోడ్ చేసి మరీ ఫ్లెక్సీలో వేశారు. ఇది గమనించిన ఆయన టీడీపీ నాయకులను నిలదీశారు. ఫొటోను కనబడకుండా పెయింట్ వేస్తామని అక్కడి నాయకులు చెప్పారని, కానీ ఫొటోను అలాగే ఉంచారని అప్పలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి)తో కలిసి ఆయన ఖండించారు. తన ప్రమేయం లేకుండా ఫ్లెక్సీలో తన ఫొటోను వేయడం అన్యాయమన్నారు. టీడీపీకి నాయకులు కరువయ్యారని, ఉన్న నాయకుల్లో కూడా గ్రూపుల కారణంగా సఖ్యత కరువైందని, దీంతో తమ పార్టీ నాయకుల ఫొటోలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అప్పారావు, అప్పలకృష్ణ ఆరోపించారు.

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని తుమ్మపాల-3 సచివాలయం పరిధిలో, పట్టణంలోని 84వ వార్డు కేఏస్ఆర్ పేట సచివాలయం పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధి సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

కొనసాగిన అంగన్‌వాడీల దీక్షలు



అంగన్‌వాడీల ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కశింకోట: కశింకోటలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకి చేరింది. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ, జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి దీక్షా శిబిరాన్ని సందర్శించి అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

రిక్షా కార్మికుల ఐక్యవేదిక ఏర్పాటు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాణిక్యాలరావు, రిక్షా కార్మికులు

తుమ్మపాల: రిక్షా కార్మికులు సంఘటితమై ఒకే వేదిక ద్వారా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని రిక్షా కార్మికుల ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న రిక్షా స్టాండ్ వద్ద కార్మిక సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు చేస్తూ, సభ్యత్వ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిక్షా యూనియన్ నాయకుడు వెంకటరమణ, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 1,307 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,260	4,770
మొదటి రకం	3,900	4,460
రెండో రకం	3,880	4,160
మూడో రకం	3,650	3,950

అనకాపల్లి సినిమాలు

జోరుగా హుషారుగా	: రాజా
ఎక్స్‌ట్రా	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
చే	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
పిండం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 17 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-7 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 416 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 384 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



నవశకం.. సంక్షేమ సంతకం

అక్కచెల్లెమ్మలకు ఆసరా

- ద్వాక్రా అక్కచెల్లెమ్మలకు జగనన్న భరోసా
- అనకాపల్లి జోన్‌లో ఆసరా లబ్ధి రూ.28.20 కోట్లు



నా పేరు ముత్తా రమణమ్మ. మాది పట్టణంలోని వేల్పులవీధి. నాకు వివాహం కాలేదు. తల్లి దగ్గరే జీవిస్తున్నా. ఉండటానికి ఇల్లు కూడా లేదు. జగనన్న గృహానికి దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించింది. ఇటీవల డ్వాక్రా సంఘం ద్వారా రూ.2 లక్షలు రుణం తీసుకున్నాను. సొంత అవసరాలుపోగా మిగిలిన మొత్తంతో ఇంటికి సమీపంలోనే టిఫిన్ కొట్టు పెట్టుకుని, నా కాళ్లపై నేను జీవిస్తున్నా. టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా రుణం మంజూరు చేసినప్పటికీ బ్యాంకు అధికారులు అధిక వడ్డీ తీసుకునేవాళ్లు. ప్రభుత్వం నుంచి ఎలాంటి వడ్డీ మినహాయింపులు రాలేదని చెప్పేవాళ్లు. జగన్‌బాబు ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీ హామీ మాకు కొండంత ధైర్యాన్నిచ్చింది. ఎలక్షన్ ముందు చెప్పినట్లే సీఎం అయ్యాక మా రుణంలో మూడు విడతలు మా బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. చివరి విడత త్వరలోనే చెల్లిస్తామన్నారు. కొత్త రుణాలకు కూడా వడ్డీ చాలా తక్కువగా తీసుకుంటున్నారు.



వేల్పులవీధి సీతారామాలయంలో డ్వాక్రా మహిళల సమావేశం

అనకాపల్లిటౌన్: గ్రామీణ ప్రాంత మహిళలు, పిల్లల జీవన పరిస్థితులు మెరుగుపరచాలి. స్వయం ఉపాధి అవకాశాలను పెంచాలి. ఈ ఆలోచనల్లో నుంచి పుట్టినదే డ్వాక్రా కార్యక్రమం. మహిళల్ని గ్రూపులుగా సంఘటిత పరచి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం చేదోడుగా నిలవాలి. గత ప్రభుత్వం వీరిని పీకల్లోతు రుణాల్లోకి నెట్టేసింది. 2014 ఎన్నికల్లో ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీ హామీని, అధికారంలోకి వచ్చాక టీడీపీ తుంగలో తొక్కింది. దీంతో 2019 ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు భరోసానిచ్చారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాలుగు విడతల్లో డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పటికే మూడు విడతల రుణ మాఫీ నిధులు రూ.28.20 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. చివరిదైన నాలుగో విడత రుణమాఫీకి సన్నద్ధమయ్యారు.

వార్డుల వారీగా డ్వాక్రా సంఘాల వివరాలు

వార్డు	గ్రూపులు	సభ్యులు
80వ	316	3,160
81వ	332	3,329
82వ	323	3,339
83వ	370	3,791
84వ	103	1,098

అనకాపల్లి జోన్‌లో డ్వాక్రా సంఘాలకు లబ్ధి

- జీవీఎంసీ జోన్-7లోని మొత్తం 1,444 సంఘాల్లో 1,186 సంఘాలకు చెందిన 10,835 మందికి వైఎస్సార్ ఆసరాలో రూ.9.51 కోట్లు రుణ మాఫీ జరిగింది.
- సున్నా(0) వడ్డీ కింద 1,370 సంఘాలకు చెందిన మహిళలకు రూ.2.64 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.
- నాలుగేళ్లలో 400 సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.4 కోట్ల రుణ సాయం దక్కింది.
- ఒక్కో సంఘానికి వారి విధివిధానాలు, సీనియార్టీ ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వం రుణ సదుపాయాన్ని అందించింది.

అనకాపల్లి జోన్‌లో వైఎస్సార్ ఆసరా వివరాలు

విడత	గ్రూపులు	సభ్యులు	నిధుల జమ రూ.కోట్లలో
మొదటి	1,206	11,316	9.19
రెండవ	1,218	11,472	10.02
మూడవ	1,196	11,301	8.99

కనకమహాలక్ష్మికి మార్గశిర పూజలు



కశింకోటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి పూల మాలలతో అలంకరణ

కశింకోట: కశింకోటలోని గవరపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర మాసోత్సవాల్లో తొలి గురువారం సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలల, నూతన వస్త్రాలతో అలంకరించారు. అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, చీరలు, రవికెలు, అరటి గెలలు, పండ్లు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ప్రతినిధి సూరిశెట్టి రేవతి తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో టమాటా ధర కిలోకి రూ.10 తగ్గింది. గత వారం రూ.40కు విక్రయించగా, ఈ వారం రూ.30కి అమ్మకాలు సాగాయి. బంగాళాదుంప రూ.30 నుంచి రూ.20కి తగ్గింది. ఉల్లిపాయ, క్యాబేజీ రూ.40, బీట్రూట్, క్యారెట్, వంకాయ రూ.60, దొండకాయ, చిక్కుడు కాయ రూ.80కి విక్రయాలు సాగాయి.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



తన కార్యాలయంలో ఈవీఎంలో ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈవీఎం ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తమ సిబ్బంది ఈవీఎం ఓటింగ్‌పై ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఓటర్ తమకు కావలసిన బటన్‌పై నొక్కిన వెంటనే ప్రక్కనే ఉన్న వీవీ ప్యాట్‌లో ఏ గుర్తుకు ఓటువేశారో చూసుకోవచ్చన్నారు. అంతకుముందు మండలంలోని కొత్తూరు, తుమ్మపాల గ్రామాల్లో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



కొత్తూరు పంచాయతీలో ఈవీఎంల ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గంగాధరరావు

రాజకీయ పార్టీల నేతలతో భేటీ

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఆర్డీవో చిన్నికృష్ణ కోరారు. గురువారం తన కార్యాలయంలో టీడీపీ, ఆప్, బీఎస్పీ నేతలతో సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉన్నట్లయితే తక్షణమే బీఎల్వోలకు తెలపాలన్నారు. దొంగ ఓట్లు, ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు ఉన్నట్లయితే తక్షణమే తొలగించేందుకు సహకరించాల్సిందిగా కోరారు. అనంతరం వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయలు, వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని అడిగిన ప్రశ్నలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, డీటీ వై.శ్రీరామమూర్తి, తరంగిణి, ఈవీఎం నోడల్ అధికారి జి.రామారావు, ఆర్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్ స్టేషన్ రోడ్డుకు మరమ్మతులు



కశింకోటలో ఎత్తు చేస్తున్న బస్ స్టేషన్ రోడ్డు

కశింకోట: స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌కు బస్సుల రాకపోకలకు అనువుగా రోడ్డును ఎత్తు చేస్తున్నారు. రోడ్డు పల్లంగా, గతుకులతో నిండి ఉండటంతో బస్సులు స్టేషన్ మీదుగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం వస్తే నీరు నిలిచిపోయి, చాలా రోజులు అధ్వాన పరిస్థితులు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి ఔటర్ కాలువ నిర్మాణంలో భాగంగా బస్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రెండు వైపులా మదుంలు నిర్మిస్తున్నారు. దీంతోపాటు బస్ స్టేషన్‌లో పల్లంగా ఉన్న రోడ్డును ఎత్తు పెంచి, చదును చేసే పనుల్ని గురువారం చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో ఈ పనుల్ని చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

నృసింహుని సన్నిధిలో విశేష హోమాలు



వెండి కవచ అలంకరణలో స్వామివారు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండోరోజైన గురువారం లక్ష్మీగణపతి, లక్ష్మీనృసింహస్వామి హోమాలను సింహాచలం దేవస్థానం పూర్వ ప్రధాన అర్చకులు గొడపర్తి గోపాలకృష్ణాచార్యులు, బంకుపల్లి శ్రీరాములాచార్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల నడుమ జరిపారు. హోమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు నిర్వహించారు. తొలుత స్వామి వారికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన నేత్రపర్వంగా జరిగింది. వెండి కవచడంతో లక్ష్మీనృసింహస్వామి, వెండి చీరలో లక్ష్మీ ఆండాళ్ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. విశేష హోమాలు, పూజలు తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయానికి స్వర్ణ సంపెంగలు, వెండి గదను రత్నాకర్ దంపతులు విరాళంగా అందించారు. వ్యాపారవేత్త కాండ్రేగుల శ్రీరామ్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈశాన్య సింహ ద్వారంతోపాటు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహనరావు, ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు, యల్లపు సత్యనారాయణ, ఆళ్ల రాంబాబు, మద్దాల కృష్ణ, కొణతాల శివరామకృష్ణ, కటారి దేముడు, పార్టీ శ్రేణులు రేబాక ఇంద్రకుమార్, చంటి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తపాలా ఉద్యోగుల దీక్షలు



తపాలా కార్యాలయం వద్ద దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: దేశవ్యాప్తంగా తపాలాశాఖ ఉద్యోగులకు కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను, 7వ వేతన కమిటీలో అమలుకాని అంశాలను తక్షణమే అమలు చేయాలని ఏఐపీఈయూ జీడీఎస్ సంఘం డివిజన్ కార్యదర్శి ఆర్‌వీ నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఉడ్‌పేట తపాలా కార్యాలయం వద్ద యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిరవధిక దీక్షలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ హోదా అమలు, 8 గంటల పని వేళలు, 12, 24, 36 ఏళ్ల అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్ల మంజూరు, రూ.5 లక్షలకు గ్రూప్ ఇన్సూరెన్స్ పెంపు తదితర డిమాండ్లతో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రూప్-సి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎ.రాజారావు, సభ్యులు మొల్లి నాగేశ్వరరావు, డీఎస్ఆర్ ప్రసాద్, ఎర్ని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం

- ప్రభుత్వ సేవల్ని ప్రజలకు చేరువ చేసిన సీఎం జగన్
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పార్టీ నేతలు

అనకాపల్లిటౌన్: అభివృద్ధి, సంక్షేమంలో దేశ చరితలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల సచివాలయం-2లో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో ఇటు రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలను సమంగా అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవల్ని ప్రజలకు చేరువ చేశామన్నారు. గ్రామాల్లో ఆర్బీకేలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఊరూరా ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మెరుగైన వైద్యాన్ని పేదలకు చేరువ చేసింది సీఎం జగనేనని కొనియాడారు.

కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అంతకు ముందు పార్టీ సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను గ్రామస్తులకు అందించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, సిగిరిశెట్టి కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ సభ్యులు మర్రిపల్లి శోభ, వైస్ ఎంపీపీ విల్లూరి చంద్రశేఖర్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పీడీ గాంధీ, బ్యాంకు ఉపాధ్యక్షుడు చిన్న, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, పార్టీ నేతలు వద్దాది అశోక్ భారతి, పన్నీరు కొండలరావు, పడాల గణపతి, ఈవోఆర్డీ ధర్మారావు, ఎమ్మెల్వో మణిచంద్ర, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



తుమ్మపాలలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, గోవింద్

80వ వార్డులో..

ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. 80వ వార్డు పరిధి అంబేడ్కర్‌నగర్ సచివాలయం-23లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా పైసా లంచం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వార్డుకో సచివాలయం ఏర్పాటు చేసి, ప్రజల చెంతకే పాలన తీసుకురావడంతో తమ ప్రభుత్వానికి ప్రజాదరణ పెరిగిందన్నారు. తొలుత సచివాలయ పరిధిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అక్కడే రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు, పార్టీ శ్రేణులు పొలిమేర మణి, ఆళ్ల గణేష్, శరగడం అప్పలనాయుడు, యల్లపు శ్రీను, మర్రా జాన్‌బాబు, ఏపీడీ దొర, వెల్ఫేర్ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.



సచివాలయం-23లో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్



జమాదులపాలెంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని జమాదులపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..'కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆమె మట్లాడుతూ గతంలో ఎన్నడూ అమలు చేయనంతగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో సీఎం జగన్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనే సీఎం కావడానికి ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, స్కూల్ కమిటీ చైర్మన్ ఒమ్మి లోవరాజు, వార్డు సభ్యుడు ఒ.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మురళి, వీఆర్వీ ఒమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

కరవు, తుపానులను జాతీయ విపత్తుగా ప్రకటించాలి



కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న సీపీఐ, రైతు సంఘాల నాయకులు

తుమ్మపాల: రాష్ట్రంలో ఏర్పడిన కరవు, ఇటీవల వచ్చిన తుపానులను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల దృష్ట్యా రాష్ట్రంలో నష్టపోయిన రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలుచేయాలన్నారు. ఈ మేరకు డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గ సభ్యులు గొల్లు గురుబాబు, బందుల భద్రం, సుబ్బలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివలంక కొండలరావు, వెలుగుల అర్జునరావు, వియ్యపు రాజు, వీరాచారి, పప్పల ఈశ్వరరావు, దేముడుబాబు, కన్నబాబు, నాగరాజు పాల్గొన్నారు.


చురుగ్గా శాంతిపార్కు ఆధునికీకరణ పనులు



శాంతిపార్కులో ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న మందపాటి జానకీరామరాజు

తుమ్మపాల: పట్టణంలో 82వ వార్డు శాంతి పార్కులో రూ.59 లక్షల జీవీఎంసీ, ఎంపీ నిధులతో చేపడుతున్న ఆధునికీకరణ పనులను వైస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, 82వ వార్డు ఇన్‌చార్జి మందపాటి జానకిరామరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అతి త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో జీవీఎంసీ రూ.49 లక్షలు కేటాయించగా, ఎంపీ బీవీ సత్యవతి మరో రూ.10 లక్షలు వెచ్చించారని పేర్కొన్నారు. పనుల పరిశీలనలో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ డీఈ బి.మహేష్, ఏఈ మణికంఠ, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో వరి పంట కోత ప్రయోగం



వరి పంట కోత ప్రయోగంలో ప్రకృతి వ్యవసాయం అధికారులు, సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వరి పంట కోత ప్రయోగాన్ని గురువారం నిర్వహించారు. సాధారణ దిగుబడి వచ్చింది. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి సీహెచ్ లచ్చన్న ఆదేశాల మేరకు కర్రి వెంకట సత్యనారాయణ పొలంలో ఐదు మీటర్ల పొడవు, వెడల్పులో పండిన పొలాన్ని కోసి, ధాన్యాన్ని సేకరించి తూనిక వేశారు. 19 కిలోల సాధారణ దిగుబడి వచ్చినట్లు ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి కూండ్రపు అరుణ వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం హెచ్ఆర్ శ్యామల, డివిజన్ ఇన్‌చార్జి నాయుడు, ఎన్ఎస్ఏ అనిత, ఎల్-1 గంటా అప్పారావు, ఎల్-2 వెంకటలక్ష్మి, మోడల్ మేకర్ దేవి తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



గుడి నిర్మాణానికి విరాళం అందిస్తున్న కనకరామ్ దంపతులు

మునగపాక: మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఆలయం శిథిలావస్థకు గురికావడంతో పెద్దలంతా నూతన ఆలయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గురువారం ఆలయ నిర్మాణానికి గాను పాటిపల్లికి చెందిన రాపేటి కనకరామ్, సత్య దంపతులు రూ.10,359 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.